రంజాన్ వేళలు

సోమవారం ఇఫ్తార్: సాయంత్రం 6.28

మంగళవారం సహర్: ఉదయం 5.10





పసి హృదయాల సంజీవని

సత్యసాయి చైల్డ్ కేర్ సెంటర్‌లో ఉచిత ఆపరేషన్

రెండు నెలల్లో 60కి పైగా చిన్నారులకు వైద్యం

నేటి నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభం

7



వినరో భాగ్యం..

120 డెసిబుల్స్‌కు మించిన శబ్దాలు వింటే లోపాలు తలెత్తే అవకాశం

ఇటీవల పెరుగుతున్న వినికిడి సమస్యలు

గంటల తరబడి ఇయర్‌ఫోన్లు వాడితే అంతే సంగతి

7

మొక్కజొన్నతో మస్తు లాభాలు

తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి

8

ఒక్క ఛాన్స్ ప్లీజ్..

ఎట్టకేలకు నామినేటెడ్ పోస్టులకు గ్రీన్‌సిగ్నల్



- 10 లోపు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- 'సుడా, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఇతర పదవుల కోసం నాయకుల మధ్య పోటాపోటీ
- నేతల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

సిద్దిపేట టౌన్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా అడపదడపా మినహా పలు నామినేటెడ్ పోస్టుల నియామకాలను చేపట్టలేదు. జిల్లాలో కొన్నినెలలుగా ఊరిస్తున్న పదవుల నియామకాని సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహరాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఈనెల 10లోపు పలు నామినేటెడ్ పోస్టులను పూర్తిచేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా, ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జులకు దిశా నిర్దేశం చేశారు. పలు కీలక పదవుల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను ఎవరిని నియమించాలో రెండు, మూడు పేర్లను అధిష్టానికి నివేదిక అందించే పనిలో పడ్డారు. నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న జిల్లాలోని పలువురు నాయకులు ప్లీజ్ తమకు ఒక్క ఛాన్స్. ఇవ్వాలంటూ నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, కొమురవెల్లి, హుస్నాబాద్‌కు చెందిన ఆశవాహులంతా నామినేటెడ్ పోస్టుల కోసం ఆరాటపడుతున్నారు.



పదవులకు డిమాండ్

రాష్ట్రంలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇన్నేళ్ల పాటు కష్టనష్టాలను ఓర్చుకుంటూ పార్టీనే నమ్ముకొని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు తమకే నామినేటెడ్ పదవులు వరిస్తాయని గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమకు నచ్చిన మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జులను మచ్చిక చేసుకుంటున్నారు. మరో వారంలోపు పోస్టుల నియామకం జరుగుతుండటంతో, ఏ పదవి ఎవరికి దక్కుతుందోనని కిందిస్థాయి నాయకులు, అనుచరులు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు.

15 నెలలుగా ఎదురుచూపులు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో సిద్దిపేట జిల్లాలోని పలు నామినేటెడ్ పోస్టుల నియామకాలను తాత్కాలికంగా నిలిపివేసింది. ఎంపీ ఎన్నికలు జరిగిన తర్వాత టీపీసీసీ అధ్యక్షుడి ఎన్నిక తరువాతనే నామినేటెడ్ పోస్టుల నియమాకం చేపడుతారన్న ప్రచారమూ జరిగింది. ఇటీవలే ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా పూర్తయ్యాయి. ఈ తరుణంలో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన టీపీసీసీ సన్నాహక సమావేశంలో ఈనెల 10 లోపు నామినేటెడ్ పోస్టులను పూర్తిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఆశవహుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఆయా జిల్లాలో ఎవరిని నియమించాలో నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు త్వరలోనే ఆయాపోస్టుల నియామకానికి సంబంధించి ఇద్దరు, ముగ్గురు చైర్మన్ల పేరుతో సహా కమిటీ సభ్యులు, డెరెక్టర్ల పేర్లను నివేదిక రూపంగా అందించనున్నారు.

'సుడా', మార్కెట్ కమిటీ చైర్మన్ల కోసం పోటీ

సిద్దిపేటఅర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా)ని జిల్లాలోని 26 గ్రామాలకు విస్తరించడంతో చైర్మన్ పదవి కోసం నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నది. సిద్దిపేటకు చెందిన పలువురు నేతలు నిన్న, మొన్నటి వరకు 'సుడా' పదవిని ఆశించగా, ఆ పదవిని మాజీ ఎమ్మెల్యే లేదా ఓ సామాజికవర్గానికి చెందిన నేతలకే ఇవ్వాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. సుడా పదవి కోసం ఆశించిన పలువురు నేతలు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవి పొందేందుకు మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జుల చుట్టూ పైరవీలు కొనసాగిస్తున్నారు.అందుకుగానూ చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లుగా కమిటీ పేర్లను ఆయా మంత్రులు, నాయకులకు పైరవీల ద్వారా పదవి పొందేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. బీసీ నినాదం రావడంతో బీసీలతో పాటు, రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన నాయకులకు పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలోని నామినేటేడ్ పదవులు

15 నెలల కాంగ్రెస్ పాలనలో జిల్లాలోని గ్రంథాలయ చైర్మన్, గజ్వేల్‌లోని మార్కెట్ కమిటీ చైర్మన్, కొమురవెల్లి ఆలయానికి సంబంధించి 14 మంది సభ్యులకు గానూ 8 మంది సభ్యులు మినహా ఎలాంటి నియామకాలు చేపట్టలేదు. కొమురవెల్లి ఆలయానికి సంబంధించి ఆరుగురిని సభ్యులుగా నియమిస్తే వారిలో ఒకరు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. దాంతోపాటుగా సిద్దిపేటఅర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్, డైరెక్టర్లు, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీఏ మెంబర్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గలతో పాటు, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లాలోని పలు ఆలయ కమిటీ చైర్మన్ పదవులున్నాయి. పలు చైర్మన్ పదవులకు మహిళా రిజర్వేషన్లు కూడా ఉన్నాయి.

మిగతా 8వ పేజీలో

మల్లన్న ఆలయంలో భక్తజనసందోహం

చేర్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోవారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్య స్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో వీవీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారి దర్శనానికి సుమారు 3 గంటల పాటు సమయం పట్టడంతో ఇబ్బందులు పడ్డారు. ఆలయ ఈవో రామాంజనేయులు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చేర్యాల సీఐ ఎల్.శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మల్లన్న ఆలయ ఆవరణలో కొత్తపల్లికి చెందిన మరాఠి ఉమా బ్యాగును పోగొట్టుకోగా గమనించిన పోలీసు సిబ్బంది పరిశీలించి బ్యాగును ఆమెకు అప్పగించారు.

ఎండలోనే బారులు..

క్యూ కాంప్లెక్స్ భవన పనులు పూర్తికాకపోవడంతో ఆలయాధికారులు ఎల్లమ్మ ఆలయ స్వాగతతోరణ ఆవరణలో మాత్రమే చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో చలువ పందిళ్లు ఉన్న క్యూలైన్లు ఏమాత్రం సరిపడలేదు. రెండువారాలుగా బతుకమ్మ పార్కింగ్ బారీకేడ్ వరకు ఎండలోనే గంటలతరబడి నిలబడుతూ ఇబ్బందులు పడుతున్నారు. మరోమూడువారాలు జాతర కొనసాగనున్నందున ఎండబారి నుంచి నిలువనీడ కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



ఎండలో క్యూలో బారులు తీరిన భక్తులు

పేదలపైనే భారం..

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

గజ్వేల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నులకు అనుకూలంగా, పేదలపై భారం వేసేలా ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యూనియన్ అధ్యక్షుడు జొన్నలగడ్డ మల్లికార్జున్ అన్నారు. గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్ రాణే బ్రేక్ లైనింగ్ యూనియన్ సీఐటీయూ సర్వసభ్య సమావేశాన్ని ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో అనేక రంగాల్లో 12 గంటల పని అమలు జరుగుతుందన్నారు. కనీస వేతనాలు ఈఎస్ఐ, పీఎఫ్ చట్టపరమైన సౌకర్యాలు అమలుకు నోచుకోవడం లేదని భవిష్యత్తులో కార్మిక వర్గానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, యూనియన్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, స్వామి శ్రీనివాస్, వెంకట్రావు, రవికుమార్, నర్సింలు, సాజిద్, మల్లేష్ పాల్గొన్నారు.



పసుపు పచ్చని పరదా పరిచినట్లు..

హుస్నాబాద్ నుంచి నాగారం వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన పసుపు పచ్చని పరదా పరిచినట్లు పొద్దుతిరుగుడు చేను చూపరులను ఆకట్టుకుంటోంది. పొద్దు ఎటు తిరిగితే అటు వాలే పొద్దుతిరుగుడు బాటసారులను కనువిందు చేస్తుంది. అటుగా వెళ్లే బాటసారులు, ప్రయాణికులు తమ వాహనాలను ఆపి పొద్దుతిరుగుడు చేనులో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు.

- హుస్నాబాద్ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి)

రైతుల్లో గుబులు..

- హైవే నిర్మాణానికి అధికారుల సర్వే
- ఉన్న భూమి కూడా పోతే తామెలా బతకాలని రైతుల ఆందోళన

కొండపాక, మార్చి2(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట-సిరిసిల్ల హైవే నిర్మాణంలో భాగంగా పలు గ్రామాల్లో రైతులు భూములు కోల్పోనున్నారు. ఇప్పటికే కొండపాక మండలంలో సర్వే పనులు మొదలుకావడంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. వారంక్రితం హైవే ఇంజనీరింగ్ అధికారులు కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో సర్వే పనులు మొదలుపెట్టారు. రోడ్డుకు ఇరువైపులా మలుపుల వద్ద హద్దులు సైతం ఏర్పాటు చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా తమ భూముల్లో హద్దులు ఏర్పాటు చేయడం ఏంటని అధికారులను ప్రశ్నించి అడ్డుకున్నారు. సూర్యాపేట నుంచి మొదలైన ఈ రోడ్డు జనగామ చేర్యాల మీదుగా రెండు లేన్లతో నిర్మిస్తున్నారు. వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద వరకు ఈ పనులు పూర్తయ్యాయి. చేర్యాల వెలికట్ట రోడ్డు మధ్య వెలికట్ట శివారులో రింగ్ రోడ్డు ఏర్పాటు చేసి ఇక్కడి నుంచి దుద్దెడ వాగుపై నుంచి రాజీవ్ రహదారిని దాటి మర్పడగ రోడ్డు వైపు వరకు ఫ్లైఓవర్ నిర్మించనున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికారులు సర్వే పూర్తి చేసి హద్దులు పాతారు. రింగ్‌రోడ్డు సమీపంలో వెలికట్టకు చెందిన పలువురు రైతులు తమ భూములను కోల్పోతున్నారు. రాజీవ్ రహదారి నుంచి మర్పడగ వైపునకు వెళ్లే రోడ్డును ఇరువైపులా 150 మీటర్ల వెడల్పు చేయడంతో పాటు మలుపులు లేకుండా ఈ రోడ్డును నిర్మించనున్నారు. అందుకు మలుపుల వద్ద, దుద్దెడ, జప్తి నాచారం మర్పడగ గ్రామాలకు చెందిన రైతుల భూములు ఈ రోడ్డు వెడల్పుతో భూములను కోల్పోనున్నారు. పొలాలతో పాటు మామిడి తోటలు సైతం కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. భారీగా నష్టం వాటిల్లకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు అధికారులకు విన్నవించారు. పచ్చని పొలాలపై నుంచి రోడ్డు వేస్తూ వెళ్తే తాము ఏమైపోవాలని కేవలం



వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద సూర్యాపేట సిరిసిల్ల నేషనల్ హైవే



దుద్దెడ రాజీవ్ రహదారి నుంచి మర్పడగకు వెళ్లే రోడ్డు

మిగతా 8వ పేజీలో

ఉప రాష్ట్రపతి పర్యటన..

ఐఐటీ హెచ్‌లో సందడి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్

- ఐఐటీహెచ్‌లో జరుగుతున్న పరిశోధనలపై ఆరా
- విద్యావిధానం, అభివృద్ధిపై వాకబు
- విద్యార్థులకు సలహాలు, సూచనలు
- హాజరైన జిష్ణుదేవ్‌వర్మ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఐఐటీహెచ్ బోర్డ్‌ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి
- ఉపరాష్ట్రపతి రాకతో భద్రతావలయంలో ప్రాంగణం
- 'ఏక్ పేడ్ మా కే నామ్'లో భాగంగా మొక్కను నాటిన జగ్‌దీప్ ధన్‌కర్ దంపతులు

7లో



ఉపరాష్ట్రపతికి జ్ఞాపికను అందజేస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

సంగారెడ్డి ఎంసీహెచ్‌లో శిశువు మృతి!

- కడుపులోనే కన్నుమూసిన పసికందు
- డాక్టర్ల నిర్లక్ష్యం వల్లేనంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ
- ఉమ్మనీరు మింగడం వల్లే శిశువు మృతి : ఆర్ఎంవో



ఎంసీహెచ్ మృతి చెందిన పసికందుతో తండ్రి, కుటుంబసభ్యులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నవజాత శిశువు మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. ఆస్పత్రి వర్గాలు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం ఎస్ఎన్.కాలనీకి చెందిన ప్రియాంక కుమారి(22) మొదటి కాన్పు నిమిత్తం సంగారెడ్డి ఎంసీహెచ్‌లో అడ్మిషన్ పొందారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు సాధారణ ప్రసవం కోసం వేచి చూశారు. ఇంతలో కడుపులో ఉన్న శిశువు హార్ట్‌బీట్ రేటు తగ్గడాన్ని గుర్తించిన డాక్టర్లు హుటాహుటిన ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి సిజేరియన్ చేశారు. అప్పటికే కడుపులోనే మగ పసికందు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఉమ్మనీరు మింగడం వల్లే శిశువు మృతిచెందిందని డాక్టర్లు కుటుంబసభ్యులకు సూచించారు.

ఆర్‌సీపురం పీహెచ్‌సీ, పటాన్‌చెరు ఆస్పత్రులే కారణం

ఇలా ఉండగా శనివారం అర్ధరాత్రి కడుపు నొప్పి వస్తుందని ప్రియాంక కుమారి ఆర్‌సీపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. ప్రసవం కోసం ప్రయత్నం చేసినప్పటికీ లోపల శిశువు ఉమ్మనీరు మిగిందంటూ చివరి నిమిషంలో పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఇక్కడా డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌కు రెఫర్ చేశారు. ఎంసీహెచ్‌లో డాక్టర్లు సాధారణ ప్రసవం కోసం మరింత సమయం వేచి చూశారే తప్పా వచ్చిన వెంటనే సిజేరియన్ చేసి ఉంటే తమ బిడ్డ బతికేవాడని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తన బిడ్డ మృతికి ఆర్‌సీపురం పీహెచ్‌సీ, పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రులే ప్రధాన కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రెండు ఆస్పత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని తండ్రి దీపక్ వాపోయారు. ఆ రెండు ఆస్పత్రుల్లో డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్ల లేరని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంతో నమ్మకంతో సర్కారు దవాఖానాకు వస్తే తమ బిడ్డను దక్కకుండా చేశారని తండ్రి కన్నీటి పర్యంతమయ్యారు.


డాక్టర్ల నిర్లక్ష్యం లేదు

రెండు ఆస్పత్రులు తిరిగి చివరి నిమిషంలో గర్భిణిని ఎంసీహెచ్‌కు తీసుకువచ్చారని, అయినప్పటికీ సాధారణ ప్రసవం కోసం ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో కడుపులోని పసికందు హార్ట్‌బీట్ పడిపోతుండటంతో సిజేరియన్ చేశాం. అప్పటికే కడుపులోనే పసికందు ఉమ్మనీరు మింగి చనిపోయింది. పసికందు మృతిపై ఎంసీహెచ్ డాక్టర్ల నిర్లక్ష్యం లేదు.

– డా.వీరాంజనేయులు, సీఎస్ఆర్ఎంవో, జీజీహెచ్, సంగారెడ్డి

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
గోపాలమిత్ర మృతి


వెంకట్‌రెడ్డి(ఫైల్)

చిన్నకోడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీ కొట్టడంతో కిందపడి తలకు తీవ్రగాయాలైన గోపాల మిత్ర అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామ శివారులో రాజీవ్‌రహదారిపై ఆదివారం జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లికి చెందిన మార్గాడి వెంకట్ రెడ్డి(52) గోపాలమిత్రగా(పశు వైద్యం సిబ్బంది) విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం వెంకట్‌రెడ్డి తన విధుల్లో భాగంగా ఇంటి నుంచి బైక్‌పై ఇబ్రహీంనగర్ గ్రామానికి పశువులకు వైద్యం చేయడానికి బయలుదేరాడు. ఈ క్రమంలో రామునిపట్ల గ్రామ శివారులోకి రాగానే అదే మార్గంలో సిద్దిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను వెనక వైపు నుంచి ఢీకొట్టింది. దీనితో బైక్‌పై నుంచి కిందపడి వెంకట్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకట్‌రెడ్డి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చింత చెట్టుపై నుంచి పడి ఒకరు..

కల్హేర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి), మండల పరిధిలోని బీబీపేట్ గ్రామంలో పిట్ల పీరయ్య (58) చింతచెట్టుపై నుంచి పడి మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన తన దగ్గరి బంధువుల వద్ద చింతపండు తెంపడానికి పీరయ్య కూలీకి వెళ్లాడు. ప్రమాద వశాత్తు చెట్టుపై నుంచి జారి పడిపోయాడు. అక్కడే ఉన్నవారు గమనించి పీరయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి..

వర్గల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఆదివారం వర్గల్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. బేగంపేట ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధి నెంటూర్ గ్రామానికి చెందిన జంపాల సత్తయ్య(55) కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీనిపై ఇంట్లో తరచూ గొడవలు జరుగుతండటంతో మనస్తాపానికి గురై శనివారం మధ్యాహ్నం ఇంటివద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన భార్య లక్ష్మి కుటుంబ సభ్యుల సహాయంతో ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కొంపల్లి వెల్‌నెస్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చేగుంటలో గుర్తుతెలియని వ్యక్తి ..

చేగుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్నది. చేగుంట ఎస్‌ఐ చైతన్య కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈనెల 28న గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉండగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతుడి వివరాల కోసం ప్రయత్నిస్తున్నారు.

నేడు ప్రపంచ వినికిడి దినం

వినడమూ ఓ భాగ్యమే.. వినపడకపోవడం లోపమే కాదు ఓ శాపం కూడా. సినిమా చూస్తున్నప్పుడు దృశ్యం కనపడి సౌండ్ వినపడకపోతే ఎంత టార్చర్‌గా ఉంటుందో ఓసారి ఆలోచించండి. శబ్దం చెవిని చేరకపోతే కనపడేదంతా మూగ ప్రపంచమే. అందుకే వినడమూ ఓ భాగ్యమే.. అలాంటి విలువైన వరాన్ని పెద్ద శబ్దాలను వింటూ సున్నితమైన చెవికి చికాకు తెప్పిస్తున్నాం. భరించలేనంత సౌండ్‌ను పదేపదే చెవికి చేర్చి లోపాలను కొనితెచ్చుకుంటున్నాం. అందుకే సాధారణం కంటే ఎక్కువ డెసిబుల్స్ ఉండే శబ్దాలను చెవికి దరి చేయనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



వినరో భాగ్యం..

120 డెసిబుల్స్‌కు మించిన శబ్దాలు వింటే లోపాలు తలెత్తే అవకాశం

ఇటీవల పెరుగుతున్న వినికిడి సమస్యలు

గంటల తరబడి ఇయర్‌ఫోన్లు వాడితే అంతే సంగతి

మెదక్ కల్చరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో వినికిడి లోపంతో బాధపడే వారి సంఖ్య ఎక్కువ శాతం కనిపిస్తుంది. గతంలో దాదాపు 20 శాతంగా ఉన్న వినికిడి లోప బాధితులు ప్రస్తుతం 30 నుంచి 35 శాతానికి పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇయర్‌ఫోన్‌లను ఎక్కువగా వాడుతున్నారు. పరిమితికి మించి గంటల తరబడి అదేపనిగా వీటిని ఉపయోగించడంతో కొత్త సమస్యలు కొనితెచ్చుకుంటున్నారని వైద్య వర్గాలు చెబుతున్నాయి. గతంలో తక్కువగా ఉన్న వినికిడి సమస్య బాధితులు ఇటీవల కాలంలో బాగా పెరిగిపోతున్నట్లు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వీటితో జాగ్రత్త

ఇటీవల పెళ్లి బరాత్, దావత్ ఏదైనా డీజే సౌండ్స్ హోరెత్తుతున్నాయి. అంతేకాకుండా క్లబ్, పబ్బులలో, క్రీడా ప్రాంగణాలలో ఏర్పాటు చేస్తున్న భారీ లౌడ్ స్పీకర్ల ద్వారా శబ్ద హోరు తీవ్రత చెవిలోపల భాగాలను పాడు చేస్తున్నాయి. ప్రధాన రహదారుల్లోని వాహనాల వద్ద 85 డెసిబెల్స్‌ను మించి ధ్వనులు ఉంటాయి. వీటిని 2 గంటల పాటు వింటే చాలు తీవ్ర పరిణామాలను



ఇయర్‌ఫోన్‌తో సమస్యలు



చెవి ఓ సున్నితమైన భాగం. అలాంటి సున్నితమైన చెవిలో ఇయర్‌ఫోన్స్‌ను ఎక్కువగా వాడుతూ సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. ఇయర్‌ఫోన్స్‌తో ఎంత హాయిగా, సౌలభ్యంగా ఉంటుందో అవి ఎక్కువగా ఉపయోగిస్తే అంతే ఇబ్బందులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇయర్‌ఫోన్‌ల ఎక్కువగా ఉపయోగించే వారిలో సాధారణ వ్యక్తులతో పోలిస్తే వినికిడి లోపం వచ్చే అవకాశం అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఇయర్ ఫోన్‌లను పెట్టుకోవడం వల్ల బయటి భాగం కొన్నిసార్లు ఇన్ఫెక్షన్లకు దారితీస్తాయి. ఎక్కువ సమయం పాటలు వినడం, ప్రతీరోజూ అదేపనిగా ఇయర్‌ఫోన్లను ఉపయోగిస్తే చికాకు కలిగించే నొప్పి వస్తుంది. నేరుగా ధ్వని చెవిలోకి చేరడంతో క్రమంగా నొప్పిగా అనిపించడం, తల, మెడ నొప్పులతో పాట ఎతల తిప్పడం వంటి సమస్యలు వస్తాయి.

ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇయర్ ఫోన్స్‌లలో పెద్ద సౌండ్‌తో సంగీతం వినడం ద్వారా 88 డెసిబుల్స్ శబ్ధం చెవిలో ప్రవేశిస్తుంది. ఇలా ఏకధాటిగా 4 గంటలు వింటే వినికిడి లోపాలు ఖాయం అంటున్నారు వైద్యులు. హెవీ మోటార్లు, బుల్డోజర్లు 90 డెసిబుల్స్ శబ్దం వెలువరిస్తాయి. వీటిని 2 గంటల పాటు వింటే వినికిడిపై ప్రభావం పడుతుందంటున్నారు వైద్యులు. 120 డెసిబుల్స్ శబ్ధం విన్న కొద్దీ క్షణాలలో చెవుల్లో నొప్పితో పాటు వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంటుంది. 120 డెసిబుల్స్‌కు మించిన స్థాయి శబ్దం వింటే వినికిడి లోపం వస్తుంది.

పెరుగుతున్న వినికిడి సమస్య బాధితులు



ఇటీవల పిల్లల నుంచి పెద్దల వరకు మొబైల్‌ఫోన్‌లలో ఎక్కువగా లీనమవుతున్నారు. చెవులకు ఇయర్‌ఫోన్స్ తగిలించుకుంటున్నారు. దీంతో సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. యువత అయితే మరీ ఎక్కువగా వాడుతున్నారు. ఇయర్‌ఫోన్స్ వాడకం తక్షణమే తగ్గించాలి. జాగ్రత్తలు కూడా తీసుకోవాలి లేకుంటే వినికిడి లోపం అధికమవుతుంది. ఇయర్‌ఫోన్ అధికంగా వాడితే ధ్వని కాలుష్యం నేరుగా చెవిలోకి చేరి వినికిడి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. విందు, వినోదాలలో పెద్ద శబ్దాలు ఎక్కువ వాడుతున్నారు. 120 డెసిబుల్స్‌కు మించి శబ్దం వింటే వినికిడి లోపం ఏర్పడుతుంది. కాబట్టి ఎక్కువ శబ్దాలను నిరోధించాలి. ఇదే కాకుండా గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

- డాక్టర్ కిరణ్ రెడ్డి, ఈఎన్టీ వైద్య నిపుణులు, మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిచాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఇన్‌పేషెంట్ వార్డు, ల్యాబ్, టీకా గది, ఔషధాలను నిలువ ఉంచే డ్రగ్ స్టోర్ విభాగాలను ఆయన పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, వైద్య సేవలను తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేంచేలా, వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. వైద్యం కోసం వచ్చిన రోగులను కలెక్టర్ పలకరించి, వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.


ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

బాలింత మృతిపై మంత్రి విచారణకు ఆదేశం

- రెండు ఆస్పత్రులను తనిఖీ చేసిన వైద్య బృందం
- రికార్డులు స్వాధీనం, నోటీసులు జారీ
- వెల్‌నెస్ హాస్పిటల్‌పై చర్యలకు వైద్య శాఖ ఆదేశం

సంగారెడ్డి అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : తీవ్ర రక్తస్రావంతో సంగారెడ్డిలోని వెల్‌నెస్ ఆస్పత్రిలో చేరిన బాలింత చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించారు. ఈ మేరకు విచారణ చేయాలని మంత్రి దామోదర్ జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో దిగ్వాల్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఎంఎల్‌హెచ్‌పీ, స్టాఫ్‌నర్సు పలువురు సిబ్బంది జహీరాబాద్‌లోని నీలం హాస్పిటల్, సంగారెడ్డిలోని వెల్‌నెస్ ఆస్పత్రులను ఆదివారం తనిఖీ చేశారు. బాలింతకు అందించిన చికిత్స వివరాలను సేకరించారు. ఇందుకు సంబంధించిన కేస్‌షీట్లను స్వాధీనం చేసుకుని ప్రాథమికంగా రెండు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశారు. ఇలా ఉండగా వెల్‌నెస్ హాస్పిటల్‌పై చర్యలకు తీసుకోవాలని పోలీసులు శాఖను కోరినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

పసి హృదయాల సంజీవని


ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్న చిన్నారులు(ఫైల్)

సత్యసాయి చైల్డ్ కేర్ సెంటర్‌లో ఉచిత ఆపరేషన్

రెండు నెలల్లో 60కిపైగా చిన్నారులకు వైద్యం

నేటి నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభం

కొండపాక, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పసి గుండెకు చిల్లు పడిందంటే ఆ తల్లిదండ్రుల వేదన చెప్పరానిది. నిరుపేద కుటుంబంలో పుట్టిన పిల్లల పరిస్థితి చెప్పనవసరం లేదు. వైద్యం అందక గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు ఎంతోమంది మృతి చెందుతున్నారు. దేశంలో 2.48 లక్షల మంది పిల్లలు పుట్టుకతో గుండె వ్యాధితో బాధపడుతున్న వారున్నారు. ఇందులో అరవై వేల మందికి ఆపరేషన్లు అవసరం. దేశంలో కేవలం పదివేల మందికి సర్జరీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులను అధిగమించడం కోసం సత్యసాయి సేవా సంస్థలు చైల్డ్ కేర్ సెంటర్‌లను ప్రారంభించింది. మారుమూల ప్రాంతమైన సిద్దిపేట జిల్లాలోని కొండపాక ఆనంద నిలయం శివారులో సత్యసాయి సంజీవని చైల్డ్ ఫర్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఈ ఆసుపత్రిలో నవంబరు చివరి మాసంలో చిన్నారులకు గుండె ఆపరేషన్లను ప్రారంభించారు. రెండు నెలల్లోనే 60కిపైగా చిన్నారులకు ఉచిత ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. ఆపరేషన్లు చేసుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రుల ఆనందం చెప్పరానిది. ఈ ఆస్పత్రిలో 45 రోజుల పసికందు మొదలు 12 సంవత్సరాల వయసు ఉన్న వారికి సైతం ఆపరేషన్లు జరిగాయి.

ఎక్కడి చిన్నారులైన నమోదు చేసుకోవచ్చు

సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో చిన్నపిల్లల గుండె ఆపరేషన్లు పూర్తిగా ఉచితంగా నిర్వహించనున్నారు. ఆపరేషన్‌తో పాటు మందులు వసతి కూడా కల్పిస్తారు. నమోదు ప్రక్రియ కాగానే మెగా ఆపరేషన్లను నిర్వహించనున్నారు. అనుభవజ్ఞులైన వైద్యులతో ఈ ఆపరేషన్లు నిర్వహించి ఎంతోమంది చిన్నారులకు భవిష్యత్‌ను కల్పిస్తున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ఎక్కడి వారైనా సరే పుట్టుకతో వచ్చిన గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నారు. సోమవారం నుంచి చిన్నారుల పేరు నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

నేటి నుంచి నమోదు చేసుకోండి

సత్య సాయి సంజీవని ఆసుపత్రిలో పిల్లలకు ఉచిత ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. ఎవరైతే తమ పిల్లలు గుండె వ్యాధితో బాధపడుతున్న వారుంటే రాష్ట్రంలో ఎక్కడి వారైనా సరే సోమవారం నుంచి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఉచిత ఆపరేషన్‌లతోపాటు ఉచితంగా మందులు వసతి అన్ని కల్పిస్తున్నాం. తెలిసిన వారు ఇతరులకు సమాచారం ఇచ్చి సహాయం చేసిన వారు కావాలి. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని చిన్నారులకు ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను కల్పించాలి.

- జగన్నాథ శర్మ, ఆసుపత్రి ప్రతినిధి

పిల్లలకు ముందుగానే స్క్రీనింగ్

చిన్నపిల్లలకు ముందస్తుగా పరీక్షలు చేసి వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తారు. సత్య సాయి సంజీవని ఆసుపత్రి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో చిన్నపిల్లలకు హెచ్‌డీ స్కెత్ ద్వారా స్క్రీనింగ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఇలాంటి స్క్రీనింగ్ చేసి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేయనున్నారు.





కొండపాకలోని సత్యసాయి సంజీవని ఆసుపత్రి

ఉప రాష్ట్రపతి పర్యటన..

ఐఐటీహెచ్‌లో సందడి

పరిశోధనలపై ఆరా.. విద్యావిధానం, అభివృద్ధిపై వాకబు

విద్యార్థులకు సలహాలు, సూచనలు

హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ఉపరాష్ట్రపతి రాకతో భద్రతావలయంలో ప్రాంగణం


ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ క్రాంతి

కంది, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌ను ఆదివారం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఆయన సతీమణి సుదేశ్ ధన్‌కర్‌తో కలిసి సందర్శించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపెష్ ఉపరాష్ట్రపతికి జగదీప్ ధన్‌కర్‌కు స్వాగతం పలికారు. ఒకేసారి రెండు హెలికాప్టర్లలో ఉప రాష్ట్రపతి దంపతులు, ఇతర అధికారులు, రక్షణ శాఖ అధికారులు వచ్చారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ ప్రాంగణంలో 'ఏక్ పెడ్ మా కే నామ్' అనే కార్యక్రమంలో భాగంగా ఒక మొక్కను నాటారు. ఐఐటీహెచ్‌లో జరుగుతున్న పరిశోధనలు, విద్యావిధానం, అభివృద్ధిని గురించి ఆయన స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఆడిటోరియంలో అధ్యాపకులు, విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. చదువు మాత్రమే ప్రతీ ఒక్కరి జీవితాన్ని మారుస్తుందని హితవు పలికారు. అత్యాధునిక పరిశోధనలతో ప్రపంచస్థాయిలో ఐఐటీహెచ్‌కు గుర్తింపు పొందిందన్నారు. ఆరోగ్య సంరక్షణలకు ఉపయోగపడే సాంకేతిక పరిశోధనలు చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులకు పేరు తెచ్చేలా ప్రతీ ఒక్కరు చదువులో రాణించాలని సూచించారు. పరిశోధనలు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



మొక్కను నాటుతున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ఆయన సతీమణి సుదేశ్ ధన్‌కర్, పక్కన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

ఐఐటీహెచ్ చుట్టూ మూడంచెల భద్రత

ఉప రాష్ట్రపతి రాక సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంతరాలు జరగకుండా ఎస్పీ రూపేష్ మూడంచెల భద్రతను చేపట్టారు. వీఐపీ పార్కింగ్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, హెలిపాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, ఐడీ కార్డుల పంపిణీ తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే ఐఐటీహెచ్‌లోకి అనుమతించారు. ఉపరాష్ట్రపతి వచ్చి వెళ్లే వరకు ఐఐటీ ప్రాంగణంలో డ్రోన్ కెమెరాలు ఇతర ఫ్లయింగ్ పరికరాల వాడకంపై నిషేధం విధించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవ్ రావు, డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఏవో సాయిబాబా, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.


నిరుపయోగంగా..

● గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో వైకుంఠధామం..



వర్గల్‌లోని వైకుంఠధామం దుస్థితి

వర్గల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలో నిర్మించిన వైకుంఠధామం నిరుపయోగంగా మారింది. గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించడంతోపాటు సరైన దారి లేకపోవడం, సౌకర్యాలూ అంతంతమాత్రమే ఉండటమే కారణంగా తెలుస్తున్నది. అసలు గ్రామానికి ప్రత్యేకంగా వైకుంఠధామం ఉందన్న విషయం కూడా చాలామంది గ్రామస్థులకు తెలియదు. ఇక్కడ కరోనా సమయంలో ఒకటో, రెండో దహన సంస్కారాలు తప్ప.. ఇప్పటివరకు పెద్దగా వినియోగించలేదు. గ్రామ సమీపంలోని స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయం (శివాలయం) దగ్గరలోనే దహన సంస్కారాలు చేస్తున్నారు. ఈ వైకుంఠధామాన్ని వినియోగించకపోవడతో అందులోని నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వైకుంఠధామంపై గ్రామస్థులకు అవగాహన కల్పించి వినియోగించే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకుంటున్న స్నానాల గదులు



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికావు

● గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డి, గంగిశెట్టి శ్రీనివాస్ గుప్తా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. యాదగిరిని టీడీపీ నుంచి తన్ని తరిమేస్తే కాంగ్రెస్ పార్టీలో రాజకీయ భిక్ష పెట్టిందే నర్సారెడ్డి అని, రాజకీయ లబ్ధి, నామినేటెడ్ పదవుల కోసం విమర్శలకు దిగడం తగదన్నారు. కనీసం కౌన్సిలర్‌గా గెలవని యాదగిరి పార్టీలో విభేదాలు సృష్టిస్తూ పక్క పార్టీల వైపు చూస్తుండడంతో పక్కన పెట్టినట్లు స్పష్టం చేశారు. నయా పైసకు పనికిరాని అనిల్ రెడ్డి, మనోహరాబాద్ మల్లారెడ్డి, గోపాల్‌రావు వంటి వ్యక్తులు మాట్లాడడం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. నర్సారెడ్డి భిక్షతో నాయకులుగా చలామణి అవుతున్న పలువురు పద్ధతి మార్చుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఆయా మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, తమ్మలి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, లింగారావు, కిష్టాగౌడ్, మాజీ ఎంపీపీ మోహన్, మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రవీందర్ గుప్త , సీనియర్ నాయకుడు, న్యాయవాది సాజిద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

చేర్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వార్షిక పరీక్షల హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న చేర్యాల పట్టణంలోని ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్య దర్శి తాడూరి భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం చేర్యాల పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల విషయంలో కొర్రీలు పెడుతూ హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న విషయమై ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న స్నేహితులు

రాయపోల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాయపోల్‌కు చెందిన బ్యాగరి రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అతడి బాల్య మిత్రులు, పదో తరగతి క్లాస్‌మేట్స్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.41వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు వెంకటేష్, స్వామి, కరుణాకర్, అంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, నర్సింములుగౌడ్, కరుణాకర్, స్వామి, విష్ణు ఉన్నారు.

వధువుకు పుస్తెమట్టెలు అందజేత

రాయపోల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం మంతూరు గ్రామానికి చెందిన ఇస్తారి రాజు, రాజమణి దంపతుల కూతురు పూజ వివాహం ఆదివారం జరిగింది. వీరిది పేద కటుంబం కావడంతో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పాల రామాగౌడ్ పుస్తెమట్టెలు అందజేశారు.

మాజీ ఎమ్మెల్సీ పరామర్శ



దౌల్తాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : దొమ్మాట మాజీ సర్పంచ్ మోహన్‌రావు ఇటీవలే ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ ఆదివారం దొమ్మాటలో మోహన్‌రావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మంజూరు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలని వినతి

కుకునూరుపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో రైల్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణం తక్కువ ఎత్తులో ఉండడంతో పెద్ద పెద్ద వాహనాలు, స్కూల్ బస్సుల రాకపోకలు తీవ్ర అంతరాయం కలుగుతుంది. దీన్ని గమనించి బ్రిడ్జి ఎత్తును పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు ఆదివారం మండల బీజేపీ నాయకులు బ్రిడ్జి నిర్మాణాన్ని గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. ఈ సమస్యను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేసాతమని హామీనిచ్చారు.

కుక్కల దాడిలో దూడలు మృతి

మద్దూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లద్నూరు గ్రామంలో కుక్కల దాడిలో రెండు దూడలు మృతి చెందాయి. బాధితుడు కర్రె స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం స్వామి వ్యవసాయలం పొలం వద్ద పశువులను కట్టేసి ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా కుక్కల దాడిలో రెండు దూడలు మృతి చెంది కనిపించాయి. సుమారు రూ.20వేల నష్టం వాటిల్లిందని, గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని బాధితుడు కోరాడు.

మొక్కజొన్నతో మస్తు లాభాలు

తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి

కోతులు, పందుల నుంచి రక్షణకు సోలార్ కంచె

మద్దూరు మండలంలో వందల ఎకరాల్లో సాగు



మద్దూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రైతుకు స్థిరమైన ఆదాయాన్నిచ్చే వనరుగా మొక్కజొన్న మొదటి స్థానంలో నిలుస్తోంది. తక్కువ పంట కాలం, పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, లాభాలు వస్తుండటంతో ఖరీఫ్‌లో వర్షాధారంగా, రబీలో బోరుబావుల కింద పెద్ద ఎత్తున మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు. మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో వందల ఎకరాల్లో యువ రైతులు మొక్కజొన్న సాగుతో మంచి ఆదాయం పొందుతున్నారు. మొక్కజొన్నలను పశువుల, కోళ్ల దాణాలో ప్రధాన ముడిసరుకుగానూ, చొప్పను పచ్చి మేతగానూ వినియోగిస్తున్నారు. అంతేకాకుండా పేలాలు, స్వీట్‌కార్న్‌గా, బేబీకార్న్‌గా ఇలా వివిధ రకాల మొక్కజొన్నను పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు, సాగు సమయంలో కోతులు, పందుల బెడద నివారణకు 50 శాతం సబ్సిడీపై సోలార్ సిస్టమ్‌ను అందించడంతోపాటు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరిస్తే మరింత మేలు జరుగుతుందని మొక్కజొన్న రైతులు కోరుతున్నారు.

పంట చుట్టూ సోలార్ కంచె..

పంట చేతికందే సమయంలో కోతులు, పందులు నాశనం చేస్తున్నాయి. వీటి నుంచి పంటను రక్షించుకునేందుకు రైతులు సోలార్ కంచెను వినియోగిస్తున్నారు. పంట చుట్టూరా కర్రలు పాతి దానికి మూడు వరుసల జే వైర్ ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో అడవిపందులు, కోతులు పంట దరిదాపులకు కూడా రావడం లేదని రైతులు చెబుతున్నారు.

ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి..



నాకున్న 6 ఎకరాల్లో 3 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చవుతుండగా, 40 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తున్నది. దీంతో ఎకరాకు రూ.65 వేలపైగానే ఆదాయం లభిస్తున్నది.

-చెవిటి మహేష్ గాగిళ్లాపూర్ రైతు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశా. అడవి పందులు, కోతుల నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యం సేకరించాలి. సబ్సిడీపై విత్తనాలు, సోలార్ కంచెను అందించాలి.

-బొల్లు చంద్రయ్య గాగిళ్లాపూర్ రైతు

భారత సామాజిక నిర్మాణంలోనే అసమానతలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం

● ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం

గజ్వేల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): భారత సామాజిక నిర్మాణంలోనే అసమానతలు ఉన్నాయని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది ఖాసీం అన్నారు. టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో జరిగిన విద్యా సదస్సు, జడ్పీహెచ్ఎస్ రిమ్మనగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెల్దె రాజులు ఉద్యోగ విరమణ సభకు ఆయన టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ 'సంక్షోభ కాలంలో మేధావుల పాత్ర' అనే అంశంపై మాట్లాడారు. దేశంలో నేడు ప్రభుత్వాలు ఫాసిజం మాటున పనిచేస్తున్నాయన్నారు. నియంతృత్వ ధోరణలను ఎదిరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతంలో టీపీటీఎఫ్ పాత్ర చాలా గణనీయమైనదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు ప్రకాశ్‌రావు, ఏపీటీఎఫ్ పూర్వాధ్యక్షులు ఏ.నరసింహారెడ్డి, పూర్వ రాష్ట్ర అధ్యక్షులు ఎ.రామచంద్రం, వై.అశోక్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నరేందర్, జోన్ పరిధిలోని అధ్యక్షులు నాగరాజు, పర్వతం నరసయ్య, గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, రాజనర్సింహ, వెంకట్, సీనియర్ నాయకులు పి.ఎల్లయ్య, దమ్మని మల్లయ్య, శంకర్, పరమేశ్వర్, జి.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

చేర్యాల, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణ శివారులోని రోళ్లబండ కాలనీ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గమనించిన చుట్టుపక్కలవారు పోలీసులు, ఫైరింజన్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ట్రాక్టర్

● యువకుడికి తీవ్ర గాయాలు

అక్కన్నపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టడంతో యువకుడు తీవ్ర గాయాల పాలైన సంఘటన ఆదివారం అక్కన్నపేట మండలం మల్లంపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మోత్కులపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఎనుముల నవీన్ మల్లంపల్లి నుంచి మోత్కులపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీ కొట్టి కొద్ది దూరం వరకు లాక్కెళ్లింది. దీంతో నవీన్ ఎడమ కాలు విరగడంతో పాటు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కి సమాచారం అందించగా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఒకరికి తీవ్ర గాయాలు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం గ్రామానికి చెందిన నడిగొట్టు సదయ్య ఆదివారం పోతారం(ఎస్) ప్రధాన రహదారిలో వ్యవసాయ బావి నుంచి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. టిప్పర్ కారును ఢీ కొట్టగా కారు సదయ్య బైక్‌ను బలం ఢీ కొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన సదయ్యను మొదట హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.



రోడ్డు వద్దని అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు (ఫైల్)

రైతుల్లో గుబులు

5వ పేజీ తరువాయి..

వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని పలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయడంతో వారి గుండెల్లో గుబులు మొదలైంది. అలైన్‌మెంట్ మార్చి తక్కువ నష్టం జరిగేలా చూడాలని కోరుతున్నారు. నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంతో కొండపాక మండలంలో సుమారు 100 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉన్నట్టు తెలిసింది.

వ్యవసాయంపైనే ఆధారం



వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. మాకున్న రెండు ఎకరాల్లో ఎంత భూమి పోతుందో తెలియని పరిస్థితి. విలువైన భూములు కోల్పోతే మా పరిస్థితి ఏంటి? మేం ఎలా బతకాలి.

-యాదవ్వ మహిళా రైతు, వెలికట్ట

నష్టం లేకుండా చూడాలి



రైతులకు ఎలాంటి నష్టం లేకుండా రోడ్డు వేయాలి. నేషనల్ హైవే రోడ్డు వల్ల పొలం అంతా పోయే పరిస్థితి ఉంది. ఇంక మేం ఎలా బతకాలి. హద్దులు ఏర్పాటు చేయడంతో ఏం చేయలేని పరిస్థితి. నష్టం లేకుండా రైతులను కాపాడాలి.

-ఐలయ్య రైతు, వెలికట్ట

పాత రోడ్డునే ఉపయోగించాలి



నేషనల్ హైవే రోడ్డును గతంలో ఉన్న రోడ్డు నుంచే ఏర్పాటు చేయాలి. కొత్త రోడ్డు వేయడం వల్ల పొలాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఉన్న రోడ్డునే కలుపుతూ నష్టాలను నివారించాలి.

-చిరంజీవి రైతు, జప్తి నాచారం



రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

ఘనంగా ఉమామహేశ్వరుడి రథోత్సవం

● ముగిసిన బ్రహ్మోత్సవాలు

మర్కుక్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగడికిష్టాపురంలో ఐదు రోజులుగా జరుగుతున్న ఉమామహేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజున రథోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, ప్రధాన ఆలయ ధర్మకర్త గుండంభట్ల వెంకటనరసింహశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ బల్లి శ్రీనివాస్, సహాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ బీసీసెల్ మర్కుక్ మండలాధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మేకల కనకయ్య ఉమామహేశ్వరస్వామి ఆలయానికి రూ.5116 విరాళాన్ని అందజేశారు.

పార్టీ కోసం కష్టపడినవారికి ప్రాధాన్యం

● గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



గౌరారంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

వర్గల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం వర్గల్ మండలం గౌరారం హరిజనవాడలో సీసీ రోడ్డు, యూడీసీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి గజ్వేల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు మంజూరు చేశారన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను గజ్వేల్ ప్రజలు గెలిపించినా.. ఒక్కరోజు కూడా వారిని కలువలేదన్నారు. ఫాంహౌస్‌కే పరిమితమై ప్రజా సమస్యలను పట్టించుకోవడమే మానేశారన్నారు. పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఆధారాలతో పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. సదా ప్రజాసేవ చేస్తూనే కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, నాయకులు గుండు నర్సింహులు, భానుప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బోర్కు నర్సింహులు, పాశం వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భాస్కర్ గౌడ్, యాదగిరిగౌడ్, కిషన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

● రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



భూంపల్లిలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న బక్కి. వెంకటయ్య

మిరుదొడ్డి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): సీసీరోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలోని 2బీహెచ్‌కేలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఆయన వెంట గ్రామస్థులు బాలాగౌడ్, నరేష్, రమేష్, దుబ్బ రాజం, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

కొమ్మూరి చొరవతో లెనిన్‌నగర్ అభివృద్ధి

● కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్

చేర్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవతో కొమురవెల్లి మండలంలోని లెనిన్‌నగర్ గ్రామం అభివృద్ధికి నోచుకుంటుందని కాంగ్రెస్ కొమురవెల్లి మండల ప్రధాన కార్యదర్శి సనాది భాస్కర్ అన్నారు. ఆదివారం ఆయన కొమురవెల్లిలో విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు గతంలో రూ.23లక్షలు నిధులు మంజూరుచేయించారని, ప్రస్తుతం ఉపాధిహామీ ద్వారా మరో రూ.6లక్షలు నిధులు కేటాయించారన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కొమ్మూరి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు.

ఒక్క ఛాన్స్ ప్లీజ్..

5వ పేజీ తరువాయి..

సిద్దిపేట అర్బన్ మండలంతో పాటు 26 గ్రామాల వరకు విస్తరించిన 'సుడా' చైర్మన్ పదవి కోసం నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. సుడా పరిధిలో రియల్‌ఎస్టేట్‌కు సంబంధించి ఏ వెంచర్ చేయాలన్న, విల్లాలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలకు సుడా అనుమతులు తప్పనిసరి కానున్నది. దీంతో ఈ పదవికి పోటీ ఎక్కువగా ఉన్నది. సిద్దిపేటలో కాంగ్రెస్ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా పార్టీని వీడకుండా, పార్టీ ఇచ్చిన ఆదేశాలు పాటిస్తున్న నాయకులకే మొదటి ప్రాధాన్యతగా పదవులు దక్కనున్నాయి. ఇటీవలే ఇతర పార్టీ నుండి కాంగ్రెస్‌లో చేరిన వారికి నామినేటెడ్ పోస్టులను కాకుండా పార్టీకి సంబందించిన పలు పోస్టులను అందించేందుకు జాబితాను రూపొందిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పదవులు తమకు వస్తాయంటూ ప్రచారాలు...

కాగా సిద్దిపేట జిల్లాలోని పలు పదువులు తమకే దక్కుతాయని నాయకులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేటకు సుడా చైర్మన్ వరించనుంది. హుస్నాబాద్‌కు ఇప్పటికే జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవి దక్కింది. దుబ్బాకకు రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్ష పదవి, చేర్యాల, కొమురవెల్లికి మల్లన్న ఆలయ చైర్మన్ పదవులు దక్కనున్నట్లు తెలిసింది. ఇక గజ్వేల్‌కు సంబంధించి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి పదవి కొనసాగుతున్నది. మరో వారం సమయం ఉండటంతో సీఎం రేవంత్‌తో పాటు ఆయనతో సన్నిహితంగా ఉంటున్న మం త్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, అనుచరుల వద్దకు పలువురు ఆశావాహులు పరుగులు తీస్తున్నారు. ఏదేమైనా సిద్దిపేట జిల్లాలో ఏవరికి పదవి దక్కుతుందో, ఎవరికి మొండిచెయ్యి చూపిస్తుందో, ఎవరిని బుజ్జగిస్తుందో మరో వారం వేచి చూడాల్సిందే మరీ.